క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా

బంగారుపాళెం: మండలంలో తుంబకుప్పం, టేకుమంద గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం పలువురు గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సంబంధిత గ్రామ కార్యదర్శులకు అందజేశారు. టీడీపీ, జనసేన పార్టీలు ఉద్దేశ పూర్వకంగా ఎన్నికల కోడ్‌ను అడ్డుపెట్టుకుని ప్రజా సేవకు దూరం చేయడంతో మనస్తాపం చెంది స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ అనూష అన్నారు. మండలంలోని 197రామాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శాంతకుమారి, దివ్య, శశి, అనురాధ, యశ్విని పాల్గొన్నారు.

మలేరియా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం మలేరియా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని కేంద్రాల్లో గురువారం విధిగా ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరిపించాలన్నారు. వ్యాధి వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



గుడిపాల: ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ నవీన్

గుడిపాల: అభివృద్ధిని చూసి ఓటేయాలని వెంగమాంబపురం సర్పంచ్ నవీన్ ఓటర్లను అభ్యర్థించారు. వెంగమాంబపురం పంచాయతీలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఇప్పటికే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తెలుగుదేశం నాయకుల మాటలను నమ్మవద్దని ఆయన వారికి తెలియజేశారు.

ఐదు నామినేషన్ల దాఖలు




బీఎస్పీ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న నాగేశ్వరరావు

పూతలపట్టు: పూతలపట్టు అసెంబ్లీ స్థానానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్పీ తరఫున నాగేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా ప్రవీణ్‌కుమార్, రాజా, అఖిల భారత జన సంఘం పార్టీ అభ్యర్థి విశ్వనాథసాయిమోహన్, ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ నుంచి నవీన్ నామినేషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు.

నేడు నామినేషన్లకు ఆఖరిరోజు

నామినేషన్ల గడువు గురువారంతో ముగియనున్నట్లు ఆర్వో చిన్నయ్య తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 3 గంటల తర్వాత కొత్త నామినేషన్లు స్వీకరించమని పేర్కొన్నారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులపై వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు.

చంద్రప్రభపై సీతారాముల ఊరేగింపు



అరగొండలో చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

తవణంపల్లె: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం చంద్రప్రభ వాహనంపై సీతారాములు ఊరేగినారు. అరగొండ కోదండరామాలయంలో ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు నిర్వహించారు. రాత్రి ఉభయదారులచే చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. చంద్రప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు.

చిత్తూరు: కట్టమంచిలో ప్రచారం చేస్తున్న చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు, అవ్వను ఓటడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, శంకరయ్య గుంటలో ర్యాలీగా వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ పూమణి, నాయకులు అన్బు







దండుకోవడమే టీడీపీ అజెండా!

- మాట ఇచ్చి మర్చిపోవడమే బాబు నైజం
- బాబుమాయలో పడితే జేబులు ఖాళీ
- జాగ్రత్త పడండి..జగనన్నను నమ్మండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



చిత్తూరు: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): అన్ని రకాలుగా దండుకోవడమే టీడీపీ ప్రధాన అజెండా అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి పంచాయతీలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న చేసిన మేలును వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో టీడీపీ మోసపూరితమైన హామీలతో గద్దెనెక్కిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను నట్టేట ముంచిందన్నారు. రైతు రుణమాఫీ పేరుతో కుచ్చుటోపీ పెట్టిందని, నిరుద్యోగులకు భృతి అంటూ శఠగోపం పెట్టిందని చెప్పారు. కేవలం టీడీపీ నాయకులు బాగు పడేలా నీరు–చెట్టు పథకం పెట్టి ప్రభుత్వ సొమ్మును కాజేశారని గుర్తుచేశారు. గ్రామాల్లో వేసిన సిమెంట్ రోడ్లు మూన్నాళ్ల ముచ్చటగా మారాయని చెప్పారు. గ్రామస్తులను బెదిరించి, వాళ్లకు అనుకూలంగా మలుచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, దీనికి వైఎస్సార్‌సీపీ బెదరదని స్పష్టం చేశారు. మాట ఇచ్చి మర్చిపోవడమే చంద్రబాబు నైజమన్నారు. బాబు మాయలో పడి జేబులు ఖాళీ చేసుకోవద్దన్నారు. జాగ్రత్త పడండి.. సంక్షేమ పాలన అందించిన జగనన్నను నమ్మండి అంటూ అభ్యర్థించారు. జగనన్న అధికారంలోకి వచ్చాక అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ, ఆసరా, సున్నవడ్డీ, పేదలకు ఇళ్లు, పక్కా గృహాలు వంటి పథకాలు అర్హులకు అందాయన్నారు. ఈ విషయంలో పార్టీలు చూడకుండా పథకాలను ఇంటికే అందించారన్నారు. ఈ మేలును ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కచ్చితంగా మళ్లీ పేదలకు మేలు జరగాలంటే అది జగనన్నతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు అమరనాథ్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

నగరంలో ప్రచారం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పలు డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ఐదేళ్లుగా ప్రజలకు ప్రభుత్వ పరంగా జరిగిన మేలును తెలియజేశారు. ఓటర్లకు కరపత్రాలు అందజేశారు. శంకరయ్యగుంటలో కార్పొరేటర్ పూమణి, నాయకులు అన్బు, బాలాజీకాలనీలో కార్పొరేటర్ చల్లముత్తు, కట్టమంచిలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు మనోహర్‌రెడ్డి, బాబీ, ఎల్‌బీపురం డివిజన్‌లో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజలిరెడ్డి ప్రచారం చేశారు.

పొరపాటును సరిదిద్దుకున్నారు



వైఎస్సార్‌సీపీలో చేరిన షరీఫ్‌తో విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు షరీఫ్ పొరపాటును తిరిగి సరిద్దుకున్నారు. మంగళవారం తేనెబండ వైపు వెళుతున్న టీడీపీ నాయకులు కొందరు షరీఫ్ ఇంటికి వచ్చి మాట్లాడుతూ టీడీపీ కండువా వేసి పార్టీలో చేరినట్లు ప్రకటించారు. జరిగిన పొరపాటును గ్రహించి బుధవారం తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. మైనారిటీలకు అండదండగా ఉండే వైఎస్సార్‌సీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనకు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి కండువా వేసి ఆహ్వానించారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ఆడుతున్న మైండ్ గేమ్‌లో పడవద్దని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మాజీ మహిళా విభాగ అధ్యక్షురాలు గాయత్రీదేవి నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనతో టీడీపీలో దడ

- వలంటీర్ మీ ఇంటికి రావాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేయండి
- పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్



టి.పుత్తూరులో పథకాలు వివరిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్



టి.పుత్తూరులో ప్రచారం చేస్తున్న నాయకులు



వృద్ధురాలిని ఓటు అడుగుతున్న పార్టీ నాయకులు

తవణంపల్లె: జగనన్న సంక్షేమ పాలనతో టీడీపీలో దడ పుట్టిందని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని టి.పుత్తూరు, దిగువ మోదలపల్లె పంచాయతీల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. డాక్టర్ సునీల్‌కుమార్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టి.పుత్తూరు కోదండరాముల స్వామి దేవస్థానంలో సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామాల్లో పెద్దలు, వృద్ధులను ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి కరపత్రాలు అందజేశారు. వలంటీర్ మీ ఇంటికి వచ్చి పథకాలు అందించాలంటే వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఎమ్మెల్యే, ఎంపీకి రెండు ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావాలంటే ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. జగనన్న ప్రవేశపెట్టి పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఓటుతో రుణం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి, పారిశ్రామికవేత్త ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ ధనంజయరెడ్డి, పాలాక్షిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ ప్రతాప్‌సుందరరాయల్ రెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి, కోదండరెడ్డి, సీనియర్ న్యాయవాది కిషోర్‌కుమార్ రెడ్డి, గిరిరెడ్డి, సిద్ధారెడ్డి, రవిరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, రవిరెడ్డి, మోహన్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, సాయిరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, మధుకుమార్, నాని, తేజారెడ్డి, దేవరాజులు, శంకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మోదలపల్లె సర్పంచ్ చలపతి, సురేష్, మధు, పండుసాహెబ్, మురుగన్, పరదేశి, చిట్టిబాబు, సుజిత్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శివాజీరెడ్డి, చంటిరెడ్డి, విక్కీరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థ ప్రతినిధులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బంగారుపాళెం: సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప గెలుపు కోసం బుధవారం సాయంత్రం మండలంలోని కాటప్పగారిపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి సునీల్‌కుమార్, రెడ్డెప్పను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సంక్షేమ పాలన కోసం మళ్లీ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. 2019లో అధికారం చేపట్టినప్పటి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. నవరత్నాల ద్వారా కులాలకు, మతాలకు, రాజకీయాలకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చారన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసి గ్రామాల ముంగిటకే సౌకర్యాలను తీసుకు వచ్చారన్నారు. ఆర్బీకే వ్యవస్థ, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలు చేకూర్చారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటుగా అగ్రవర్ణాలలోని పేదలు బాగు పడాలన్నా 2024 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చారన్నారు. గ్రామాల ముంగిటకు కార్పొరేట్ వైద్య సేవలను తీసుకు వచ్చి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు తెల్లవారక ముందే తలుపు తట్టి పింఛను అందిస్తున్నారన్నారు. జగనన్నను ప్రజలు దీవించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ప్రభునాయుడు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, నాయకులు గోవిందస్వామి, థామస్, కరుణాకర్, జిల్లా సలహా మండలి డైరెక్టర్ జగదీష్‌రెడ్డి, మండల ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజ, దొరస్వామి, విద్యార్థి సంఘ నాయకుడు శైలేష్‌బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కల్యాణం కమనీయం!



సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో బుధవారం కోదండరామస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. చిత్తూరు నగరంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందుగా స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. డప్పువాయిద్యాలు, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వామి వారి పట్టువస్త్రాల కార్యక్రమం ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. తదనంతరం ప్రత్యేక అలంకరించిన సీతారాముల వారిని కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆ ఘట్టాన్ని భక్తులకు వివరిస్తూ, ఉత్సవాన్ని పూర్తి చేశారు. దీంతో ఆ వేదిక శ్రీరామ నామస్మరణలతో మార్మోగింది. వచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదం తదితరులను పంపిణీ చేశారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వడదెబ్బపై అప్రమత్తం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఎండల తీవ్రత మూలాన వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని మండలంలోని ముట్టుకూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులు, ఇతర రోగులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు–సలహాలిచ్చారు. గర్భవతులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. అలాగే ప్రస్తుతం వడగాల్పులు అధికంగా ఉండడంతో దీర్ఘకాలిక రోగులు, ప్రజలు ఎండల్లో వీలైనంతవరకు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, తులసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు అశ్విని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల వైద్య సేవలపై అవగాహన



నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ

బంగారుపాళెం(యాదమరి): గర్భిణులకు అందించే వైద్య సేవల్లో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ సూచించారు. మండలంలోని జంగాలపల్లె సబ్ సెంటర్ ఆవరణలో బుధవారం నర్సింగ్ విద్యార్థులకు గర్భిణులకు అందించాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణుల నమోదు ఎలా చేయాలి, నమోదు తరువాత ప్రతి నెలా వేయాల్సిన సూదిమందులు, కాన్పుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భంగా ఉన్న సమయంలో చేయాల్సిన వైద్య పరీక్షలపై అవగాహన కల్పించారు. కాన్పు అనంతరం చిన్నారికి వేయాల్సిన వ్యాధి నిరోధక టీకాలు, బాలింతలను ఎలా సంరక్షించాలనే వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.